క్లుప్తంగా...

జేటీఓపై జలమండలి కార్మికుల ఫిర్యాదు

మణికొండ: జలమండలి ట్రాన్స్‌మిషన్‌లో గండిపేట కేంద్రంగా పనిచేస్తున్న జూనియర్ టెక్నికల్ అధికారి రమేష్‌పై కార్మికులు గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన సిబ్బందిని దూషిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గండిపేటలో పనిచేస్తున్న కార్మికులు జనరల్ మేనేజర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆయన గతంలోనూ ఇదే విధంగా వ్యవహరించడంతో డీజీఎంకు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు సైతం జేటీఓకే వత్తాసు పలకడంతో అతని ఆగడాలు మితిమీరాయన్నారు. జేటీఓపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విద్యుత్ స్తంభానికి మంటలు



సెక్రటేరియట్ కాలనీలో మండుతున్న విద్యుత్ స్తంభం

మణికొండ: విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న కేబుల్, ఇతర వైర్లకు మంటలు అంటుకున్న సంఘటన గురువారం సెక్రటేరియేట్ కాలనీలో చోటు చేసుకుంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సెక్రటేరియేట్ కాలనీలోని విద్యుత్ స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుని స్తంభానికి పాకాయి. స్థానికుల సమాచారంతో స్పందించిన విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

రాజేంద్రనగర్‌లో భారీ వర్షం



పిడుగు పడటంతో కాలిపోతున్న కొబ్బరి చెట్టు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్‌లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, నౌనెంబర్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, బుద్వేల్, యూనివర్సిటీ ప్రాంతాల్లో చెట్టు కొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి ఉక్కపోతతో సతమతమైన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో సేదతీరారు. రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయ సమీపంలో పిడుగుపడి కొబ్బరి చెట్టు కాలిపోయింది.ఈ కారణంగా ఎస్‌సీసీ కార్యాలయంతో పాటు డీసీపీ కార్యాలయంలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి.

హెచ్‌సీయూలో పుస్తకావిష్కరణ



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో గురువారం సాయంత్రం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సెంటర్ ఫర్ దళిత్ అండ్ ఆదివాసీ స్టడీస్ అండ్ ట్రాన్స్‌లేషన్ విభాగం, అంబేద్కర్ రీడింగ్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌సీయూ విద్యార్థిని నమ్రతాసింగ్ రచించిన 'భోజ్‌పురి నవజాగరణ్ ఔర్ భికారీ ఠాకూర్' అలాగే 'సమ రాష్ట్ర ఝురి ఇన్ ది ల్యాండ్స్ ఆఫ్ కృష్ణా గోదావరి'ను ఆవిష్కరించారు. సమరాష్ట్ర మంచ్ జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్, హెచ్‌సీయూ ప్రో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్ఎస్ సర్రాజు చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ థాట్స్ ఆన్ సోషల్ రిఫార్మ్స్ అండ్ జస్టిస్ అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సమరాష్ట్ర మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వంశీతిలక్, సీడీఏఎస్‌టీ ఇన్‌చార్జ్ హెడ్ ప్రొఫెసర్ అన్నపూర్ణ, ఏబీవీపీ అధ్యక్షురాలు నమ్రతాసింగ్, పలువురు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మందికి జైలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 22 మందిని గురువారం ఉప్పర్‌పల్లి 3వ స్పెషల్ ఎంఎం కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు. వీరిలో 8 మందికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మిగిలిన వారికి జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రెండు రోజులు ఇద్దరికి, ముగ్గురికి మూడు రోజులు, నాలుగు రోజులు ఇద్దరికి, ఒకరికి ఐదు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఆయన వివరించారు.

మున్సిపాలిటీల్లో నీటి కటకట

- తగ్గిన సరఫరా, లో ప్రెషర్
- వట్టిపోయిన బోర్లు
- ఆలస్యంగా ట్యాంకర్లు
- ప్రజల అవస్థలు



మణికొండ మంచినీటి పంపిణీ కేంద్రంలో సిద్ధంగా ఉన్న ట్యాంకర్లు

మణికొండ: వేసవి కాలం వచ్చిందంటే నీటి వాడకం పెరగడంతో పాటు బోర్లు వట్టిపోతాయని అందరికీ తెలిసిందే. ఇలాంటి సమయంలో నీటిసరఫరాను పెంచి ప్రజలకు అండగా నిలవాల్సిన జలమండలి సరఫరా సమయాన్ని, ప్రెషర్‌ను తగ్గిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుంది. నెల రోజుల క్రితం వరకు నీళ్లు రోడ్లపై వృథాగా పారుతున్నా పట్టించుకోని అధికారులు, అవసరమైన సమయంలో మాత్రం నీటి సరఫరాపై ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుందామన్నా బుక్ చేసిన మరుసటి రోజుకు గాని నీళ్లు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో వేసవి కాలంలో ఇక్కడే ఉండాలా...లేక నీళ్లు దొరికే ప్రాంతాలకు తరలి వెళ్లాలా అనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో గత 15 రోజులుగా నీటి సరఫరా సమయంతో పాటు ప్రెషర్‌ను తగ్గించటంతో గతంలో వచ్చే నీటితో పోలిస్తే సగం నీళ్లు కూడా రావడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే ఎండలు పెరిగిపోవటంతో బోర్లు వట్టిపోయాయని, నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయమై జలమండలి అధికారులను సంప్రదించగా తాము ఏమీ చేయలేమని, పై నుంచి సరఫరా తక్కువగా వస్తుందని, దానినే అన్ని కాలనీలకు సర్దుతున్నామని తెలిపారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నీరు సరఫరా కావాల్సి ఉండగా రెండు రోజుల తరువాత సరఫరా చేయటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సమయానికి రాని ట్యాంకర్లు...

జలమండలి రోజు విడిచి రోజు సరఫరా చేసే నీరు తక్కువగా వస్తుండటం, కుటుంబ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉన్న వారు ట్యాంకర్లను తెప్పించుకోవాల్సి వస్తోంది. దీంతో వారు బుక్ చేసిన మర్నాడు ట్యాంకర్ వచ్చే పరిస్థితి నెలకొంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కేవలం ఐదు ట్యాంకర్లను మాత్రమే ఏర్పాటు ఉండటం, ప్రస్తుతం రోజూ 90 నుంచి 120 ట్యాంకర్ల బుకింగ్‌లు వస్తుండటంతో సమస్య ఎదురవుతోందని డ్రైవర్లు పేర్కొన్నారు. మరో పది ట్యాంకర్లను ఏర్పాటు చేస్తే ఎప్పటికప్పుడు సరఫరా చేయవచ్చని వారు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు జలమండలి ఉన్నతాధికారులతో చర్చించి నీటి సరఫరా సమయాన్ని, ట్యాంకర్లను పెంచాలని కోరుతున్నారు.

సీబీఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ పోటీలు



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీర్స్, హైదరాబాద్ రీజనల్ కేంద్రం, సీబీఐటీ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజ్–2023 పేరిట గురువారం పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ రీజనల్ కేంద్రం చైర్మన్ డాక్టర్ సంజయ్ బరద్వాజ్ ఇన్నోవేషన్, ఎకోసిస్టం, ఇన్ ఇండియా అనే అంశంపై మాట్లాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ హైదరాబాద్, ఐఐటీ బాసర, బీవీఆర్ఐటీ, బిట్స్ ఫిలానీ హైదరాబాద్ క్యాంపస్, ఎన్ఐటీ వరంగల్, సీబీఐటీ విద్యార్థులు మోడల్ మేకింగ్, టెక్నికల్ క్విజ్, వ్యాస రచన, వ్యక్తిత్వం తదితర విభిన్న పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ముకుంద వాణి, సమన్వయ కర్త డాక్టర్ కె. ప్రసాద్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రాజేంద్రనగర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న పలుగు చెరువు మహేష్

రాజేంద్రనగర్: సమానత్వం కోసం అహర్నిశలు కృషి చేసిన, మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతోత్సవ కమిటీ అధ్యక్షులు పలుగు చెరువు మహేష్ అన్నారు. గురువారం బుద్వేల్‌లోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, కార్తీక్‌రెడ్డి, కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్‌రెడ్డి, పోడవు అర్చన జయప్రకాష్, సంగీతగౌరీశంకర్ హాజరుకానున్నట్లు తెలిపారు. వేడుకల్లో దళిత సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజల సౌకర్యార్థం అధునాతన కమ్యూనిటీహాళ్లను నిర్మిస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ మేయర్ మహేందర్‌గౌడ్ తెలిపారు. గురువారం 22వ డివిజన్‌లోని వినాయక్‌నగర్ కాలనీలో కొనసాగుతున్న కమ్యూనిటీహాల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిటీహాల్‌ను అధునాతన పద్ధతిలో నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులను మంజూరు చేయించారన్నారు. కార్పొరేషన్ పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలు సభలు, సమావేశాలు, చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకునేందుకు కమ్యూనిటీహాల్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టు నూతన కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ ప్రింట్ మీడియా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమయ్యే సమాచారం అందించాలన్నారు. నియోజకవర్గంలో పని చేసే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఎం.దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, వర్కాల చందు, ప్రధాన కార్యదర్శి పగిడిమర్రి సూర్యనారాయణ, కోశాధికారి విజయ్‌కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శి ప్రేమ్‌రాజ్, సంయుక్త కార్యదర్శులు కోరని మహేష్, లక్ష్మణ్, క్రీడల కార్యదర్శి గడ్డె యాదగిరి, కార్యవర్గ సభ్యులు కోట్ల చంద్రకాంత్, సలహాదారులు అప్పారెడ్డిగూడెం భీమయ్య, దొంతిరెడ్డి పాపిరెడ్డి, సూర్యకిరణ్, ఏపీ చారి తదితరులు పాల్గొన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'బీ లైట్ అండ్ ఫీల్ మైట్' అనే అంశంపై లైఫ్ కోచ్, మెడిటేషన్ గైడ్ కౌన్సిలర్ ఈ.వి.స్వామినాథన్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ పర్యటించారు. తేజస్వీ కాలనీలో అధికారులతో కలిసి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్లు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యలకు కారణాలను గుర్తించి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాములు, నరహరి, రాజు, బుచ్చిరెడ్డి, చెన్నయ్య, ఎస్ఎస్ కృష్ణకిషోర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్

నార్సింగి ఆరోగ్య కేంద్రం తనిఖీ



నార్సింగి ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఎన్‌క్యూఎస్ అధికారులు

మణికొండ: జాతీయ నాణ్యతా ప్రమాణ(ఎన్‌క్యూఎస్) అధికారులు బుధ, గురువారాల్లో నార్సింగి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఆరోగ్య కేంద్రంలోని ప్రతి విభాగం అందిస్తున్న సేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు డాక్టర్ తమన్నా, డాక్టర్ జ్యోతీమీనా రెండు రోజుల తనిఖీల అనంతరం ఆస్పత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పర్యవేక్షణ అధికారులు జె.అర్జున్ నాయక్, ఆర్. రాము, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ వారికి అవసరమైన సమాచారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటలక్ష్మి, సాల్మన్‌రాజు, శ్రీనివాస్, అన్నపూర్ణ, శ్రీనివాస్, కరుణ, షేహనాజ్, తేజ, జయమ్మలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో దొంగతనాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక



రాయదుర్గం: గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సమ్మర్ క్రైమ్స్ ప్రివెన్షన్‌పై సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా దొంగతనాలు వేసవిలో జరుగుతాయన్నారు. పోలీసు సిబ్బంది రానున్న రెండు నెలల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జోన్ల వారీగా డే అండ్ నైట్ బీట్‌లను స్వయంగా పరిశీలిస్తానన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అంతరాష్ట్ర ముఠాలపై నిఘా ఉంచాలని, గేటెడ్ కమ్యూనిటీస్ అపార్ట్‌మెంట్స్ విల్లాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులపై నిఘా ఉంచడంతో పాటు క్షేత్రస్థాయి పోలీసు సిబ్బంది హోటళ్లు, లాడ్జిలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల తనిఖీ తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ డీసీపీ క్రైమ్స్ కల్మేశ్వర్, లా అండ్ ఆర్డర్ డీసీపీలు శిల్పవల్లి, నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సందీప్, ఏడీసీపీ రేష్మిపెరుమాళ్, నర్సింహారెడ్డి, ఇతర ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకే సీఎం సహాయ నిధి



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: పేద ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారులకు గురువారం సీఎం సహాయ నిధి చెక్కులను స్థానిక మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి పంపిణీ చేశారు. బండ్లగూడకు చెందిన టి.నర్సింహ్మకు రూ. 52 వేలు, కిస్మత్‌పూర్‌కు చెందిన రమేష్‌కు రూ.లక్ష, హిమాయత్‌సాగర్‌కు చెందిన మహేష్‌కు రూ.40 వేలు, దర్గాఖలీజ్‌ఖాన్‌కు చెందిన యేసయ్యకు 21 వేలు, పీరంచెరువకు చెందిన షేక్ హమ్మద్‌కు రూ.59 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు దరఖాస్తులు చేసుకున్న వెంటనే సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు మలాకీ రత్నం, సీనియర్ నాయకులు సయ్యద్‌ఖాజా, రజాక్, చేగురి రాజు, మల్లేష్‌యాదవ్, శ్యాంలేట్ రాజు, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి మునిసిపాలిటీ పరిధిలో..

మణికొండ: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పేదలను ఆదుకుంటున్నాయని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన కె.జ్యోతికి రూ. 28వేలు, కోకాపేట గ్రామానికి చెందిన పి. మల్లేష్‌కు రూ. 60వేలు, మణికొండకు చెందిన సి.గండెమ్మకు రూ.20వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్. నర్సింహ, బి. శ్రీరాములు, రామకృష్ణారెడ్డి, హరిశంకర్, మల్లేష్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



ఎర్రబోడలో పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కార్యకర్తలకు సూచించారు. పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడలో బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు కాసోజు మల్లేష్‌చారి ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు చేపట్టాలన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు బాబురావు, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమురయ్య, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు నర్సింహ, సులిగే వెంకటేష్, వాసు, మల్లేష్ యాదవ్, విజయ్‌కుమార్, బిట్కూరి సిద్దేశ్వర్, సందీప్, ఎల్.వెంకటేష్, బి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి



గాయత్రీనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందు చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. గురువారం 21,22వ డివిజన్‌లో గాయత్రీనగర్ రహదారిపై చేపట్టిన సీసీ రోడ్డు పనులను సీనియర్ నాయకుడు గోపాల్‌ముదిరాజ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య, విద్యుత్ స్తంభాలు, వీధిదీపాలు తదితర సమస్యలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు అభివృద్ధి పనులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో దళితులకు అన్యాయం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులను మాయమాటలతో మోసం చేస్తున్నారని ఆయనకు తగిన గుణపాఠం చెప్పేందుకు దళితులు ఏకం కావాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానందం అన్నారు. కేసీఆర్ మోసాలపై గురువారం బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి దళితుడిని తొలి ముఖ్యమంత్రిని చేస్తానని, మూడు ఏకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో వారికి మాయమాటలు చెప్పి మోసం చేశారన్నారు. దళిత బంధు అమలుకు నోచుకోవడం లేదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకే అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. దళితులు ఏకమై కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి మల్లారెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి సభ్యులు మూల శ్రీనివాస్‌గౌడ్, డివిజన్ దళిత మోర్చా అధ్యక్షులు టి.మల్లేష్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతికుమార్, డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు మల్లేష్‌చారి, జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, రాజు పైల్వాన్, జగన్, రాపర్తి రాకేష్, సందీప్‌ముదిరాజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీపీకి కేఎస్ దయానంద్ రాజీనామా



రాజేంద్రనగర్: తెలంగాణ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి కె.ఎస్.దయానంద్ గురువారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షురాలు షర్మిలకు ఫ్యాక్స్ ద్వారా రాజీనామా పత్రాన్ని పంపించారు. అనంతరం బుద్వేల్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో పని చేసే వారికి గుర్తింపు లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధనకు పార్టీలో చేరామని, అయితే అందుకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలు కొనసాగడం లేదన్నారు. పార్టీలో నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు లేదని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలను అడ్డా కూలీలుగా భావిస్తున్నారన్నారు. తన అనుచరులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

8వ బెటాలియన్‌లో హెల్త్‌క్యాంపు

గచ్చిబౌలి: నరాల సంబంధిత సమస్యలు తలెత్తితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని కాంటినెంటల్ ఆస్పత్రి న్యూరో సర్జన్లు, డాక్టర్ లక్ష్మీనాథ్, డాక్టర్ శివరాజ్‌లు సూచించారు. గురువారం కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన హెల్త్‌క్యాంప్‌లో నరాల సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించారు. వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ పి.మురళికృష్ణ, అడిషనల్ కమాండెంట్లు టి.గంగారం, టీఎస్ సంఘ్, అసిస్టెంట్ కమాండెంట్లు దేవిదాస్ రాథోడ్, నర్సింహస్వామి, రహమాన్, సత్యనారాయణ, ఏట కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.